## క్లుప్తంగా

### అందుబాటులో ఎరువులు

**ఉప్పునుంతల:** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువుల బస్తాలను ఉన్నాయని పీఏసీఎస్ సీఈఓ రవీందర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ 850 బస్తాలు (ఒక బస్తాకు రూ. 1350లు), 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువు 1330 బస్తాలు (బస్తా రూ. 1200లు), 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు 180 బస్తాలు (బస్తా రూ. 1500లు), పొటాష్ 490 బస్తాలు (ఒకటి రూ. 1700లు), సూపర్‌ఫాస్ఫేట్ 180 బస్తాలు (రూ. 500లు) అందుబాటులో ఉన్నాయని సీఈఓ తెలిపారు.

### నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగరాజుగౌడ్

**వెల్దండ:** మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్ కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



**లింగాల:** మండల కేంద్రానికి చెందిన రామయ్య భార్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రామయ్య స్నేహితులు బాధితుడి పరామర్శించి ఓదార్చారు. 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు పోగు చేసిన రూ. 24 వేలను ఆదివారం మిత్రుడికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటాచారి, ప్రశాంత్, శివయ్య, కృష్ణయ్య, ముస్తాఫా, రాములు పాల్గొన్నారు.

### తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

**ఉప్పునుంతల:** పత్తి పంటలో వచ్చే తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సునీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటలకు మందుల పిచికారి చేసే సమయంలో రైతులు తప్పకుండా ముఖానికి మాస్క్, చేతులకు బ్లౌజులు ధరించాలని, పొడవాటి షర్టు, ప్యాంట్ వేసుకోవాలని కోరారు. ఖాళీ మందు డబ్బాలను విధిగా భూమిలో గోతితీసి పాతిపెట్టాలని సూచించారు.

### బాధితులకు అండగా ఉంటా

**బిజినేపల్లి:** అనారోగ్యంతో మరణించిన ఇస్లావత్ గోపాల్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ తనయుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, వట్టెం సర్పంచు అమృతరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బాలరాజు, హరీశ్వర్‌రెడ్డి, రాంచందర్, నితిన్, హేమ్యానాయక్, ఉన్నారు.

### భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



**కల్వకుర్తిరూరల్:** మండలంలోని సుద్దకల్, తుర్కలపల్లి గ్రామాలలో పీర్ల పండుగ కొనసాగుతోంది. మండలంలోని అన్ని గ్రామాలలో మొహర్రం ఉత్సవాలు ముగిసినా ఈ రెండు గ్రామాల్లో మాత్రం కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో పీర్ల చావిడి వద్ద నైవేద్యం సమర్పిస్తున్నారు. సోమవారం పీర్ల నిమజ్జనం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

### గోసంరక్షణ అందరి బాధ్యత

**కల్వకుర్తిరూరల్:** గోసంరక్షణ అందరి బాధ్యత అని లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు లయన్ కల్మిచర్ల రమేష్ అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ లయన్ జి బాబురాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాలలో గోపూజ నిర్వహించారు. శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, దెందు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం

**వెల్దండ:** మండలంలోని కొట్రతండాకు చెందిన యువతి ఇస్లావత్ లక్ష్మి అదృశ్యమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా అనారోగ్యంతో కల్వకుర్తి ఆస్పత్రిలో లక్ష్మి చికిత్స పొందుతూ ఉంది. శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయగా ఇంటికి వచ్చారు. ఆదివారం బాధితురాలు లక్ష్మి ఆరోగ్యం బాగా లేదని ఆస్పత్రికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. తల్లి దస్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చారకొండ మర్రిపల్లి మధ్యలో..



బల్మూరు మండలం కొండనాగులలోని బీసీ కాలనీ రోడ్డు



శ్రీశైలం–నాగర్‌కర్నూల్ రహదారి

# అధ్వానంగా రహదారులు

**చారకొండ/బల్మూరు:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతలు దర్శనం ఇస్తున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గుంతలలో వర్షపు నీరు నిలిచింది. గ్రామాలకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టిరోడ్లు బురదమయంగా మారాయి. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. చారకొండ మండల కేంద్రం నుంచి మర్రిపల్లి గ్రామం వరకు ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసం అయ్యింది. జూపల్లి నుంచి వంగూరు వెళ్లే మట్టిరోడ్డుపై మోకాళ్లోతు నీరు నిలిచింది.



జూపల్లి నుంచి వంగూరు వెళ్లే రోడ్డు ఇలా..

**అంతర్గత రోడ్లు ఛిద్రం**

బల్మూరులోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయి. మండలంలోని కొండనాగుల, బల్మూర్, చెన్నారం, తోడెళ్లగడ్డ తదితర పంచాయతీల్లో బురదమయంగా దర్శనమిస్తున్నాయి. తుమ్మెన్‌పేట స్టేజీ నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు బీటీ రోడ్డు కంకర తేలింది. శ్రీశైలం–నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి ప్రయాణించేందుకు వీలులేకుండా పోయింది. రోడ్లు ప్రమాదకరంగా ఉండటంతో పనులను వాయిదా వేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కులవృత్తులను కాపాడుకుందాం

**తాడూరు:** కుల వృత్తులను కాపాడుకుందామని విశ్వ బ్రాహ్మణుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు వీరాచారి, ఉపాధ్యక్షుడు జంగాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండల స్థాయి విశ్వ బ్రాహ్మణుల సమావేశంలో వారు మాట్లాడారు. రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకున్న విశ్వబ్రాహ్మణులందరికీ ఆర్థికసాయం చేసి ఆదుకోవాలన్నారు. 50 ఏళ్లు దాటిన విశ్వబ్రాహ్మణులకు పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో విశ్వ బ్రాహ్మణుల కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విశ్వబ్రాహ్మణులు శ్రీనివాసులు, తిరుపతాచారి, విశ్వనాథం, రామాచారి, కృష్ణయ్య, అనంత రాములు, బాలకృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరాచారి

## ప్రమాదకరంగా వంతెన



**వెల్దండ:** మండలంలోని చెర్కూర్–గాన్‌గట్టుతండా గ్రామాల మధ్య ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావస్థకు చేరడంతో ఇరుగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ



మాట్లాడుతున్న భీమయ్య

**తాడూరు:** ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ అలవడుతుందని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు, రిటైర్డ్ జీహెచ్ఎం భీమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా హిందూమతాన్ని చులకన చేస్తూ ప్రచారం చేస్తే అడ్డుకోవాలన్నారు. చిన్ననాటి నుంచే భగవద్గీత శ్లోకాలతో పాటు గీతా సారాంశంపై అవగాహన కల్పించాలని తల్లిదండ్రులను కోరారు. బాలస్వామి, నర్సింహా, వీరాచారి, యార కృష్ణయ్య, అనంతరాములు, జంగాచారి, మల్లాచారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 5న ప్రియాంకగాంధీ రాక



**బిజినేపల్లి:** ఆగస్టు 5వ తేదీన కొల్లాపూర్‌లో నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ గిరిజన యూత్ ప్రెసిడెంట్ సురేష్ అన్నారు. ఆదివారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్‌నాయక్, రమేష్, సెహ్వాగ్, రాము, విజయ్, లక్ష్మీరాంనాయక్, హనుమంతు, శ్రీను, శివకుమార్, విష్ణుసాల్‌రెడ్డి, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలి

**నాగర్‌కర్నూల్‌రూరల్:** స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు వహీద్‌ఖాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్వీపర్ల సమ్మె 40వ రోజుకు చేరింది. దీంతో ఆయన వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 160 మంది స్వీపర్లు కేవలం రూ.1623 ల వేతనంతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగభద్రతతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్, నాయకులు వెంకటయ్య గౌడ్, అర్జున్, పుల్లయ్య, నిరంజన్,జయమ్మ, నారాయణ, ఈశ్వరమ్మ, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వహీద్ ఖాన్

## రేపు బైక్ ర్యాలీ

**కల్వకుర్తి రూరల్:** ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను సాధనకోసం మంగళవారం నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు జగదీశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# శిథిలావస్థలో పాఠశాలలు



శిథిలావస్థకు చేరిన కోమటికుంట యూపీఎస్

**లింగాల:** కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థలకు చేరుకున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. మండలంలో 2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ఆశ్రమ పాఠశాలలు, ఐదు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయం, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, బాలికల మినీ గురుకుల పాఠశాల, జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల ఉన్నాయి. దాదాపుగా అన్ని పాఠశాలల్లో మొత్తం నాలుగువేల మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు.

**కూలేందుకు సిద్ధంగా తరగతి గదులు**

మండల పరిధిలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాల గదులు శిథిలావస్థకు చేరాయి. గదుల పై కప్పులు పెచ్చులూడడం, గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇక్కడ ఒకటి నుంచి 7 తరగతులకు గాను 100 వరకు విద్యార్థులు ఉన్నారు. తరగతులను వరండాలో కొనసాగిస్తున్నారు. జీల్గుపల్లి ప్రాథమిక పాఠశాల గదులు ఇప్పటికే కూలాయి. గతంలో నూతనంగా నిర్మించిన గది వరండాలో తరగతులను కొనసాగిస్తున్నారు. మాడాపూర్, పద్మన్నపల్లి, శాయిన్‌పేట, రాంపూర్, బాకారం తదితర పాఠశాలల పరిస్థితి కూడా దారుణంగా ఉంది.

**నత్తనడకన మన ఊరు–మన బడి పనులు**

ప్రభుత్వం మండలంలోని 10 పాఠశాలల్లో మన ఊరు–మనబడి పథకంలో అదనపు గదుల నిర్మాణాలు మంజూరు అయ్యాయి. కాగా ఆయా పాఠశాలలో గదుల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. అప్పాయపల్లి పాఠశాలలో అర్ధాంతరంగా పనులు నిలిపి వేశారు. పథకం పనులపై పర్యవేక్షణ లేక పోవడం, నిర్మాణాలకు దశల వారిగా అందాల్సిన బిల్లులు అందక పోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిరుత్సాహంతో ఉన్నారు. పథకంలో మొదటి దశలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలను గుర్తించి పనులు మంజూరు చేయించి ఉంటే కొంత వరకు మేలు జరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**సమస్య జఠిలంగా ఉంది**

పాఠశాలలో సమస్య చాలా జఠిలంగా ఉంది. సరిపోను తరగతి గదులు లేక పోవడం, ఉన్న గదులు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. వరండాలో పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. గదుల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు విడుదల చేయాలి.

–అంజిలాల్ హెచ్ఎం, కోమటికుంట యూపీఎస్

**సమస్యలు పరిష్కరిస్తాం**

అసౌకర్యాల మధ్య పలు పాఠశాలల్లో విద్యార్థులు చదువులు కొనసాగించడం వాస్తవమే. పాఠశాలల మరమ్మతు కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రెండో దశలో సమస్యలు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యత ఇస్తూ సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– చంద్రుడు, ఎంఈఓ, లింగాల

## రోడ్డు నిబంధనలు పాటించాలి



**చారకొండ:** రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ రవి అన్నారు. మండల కేంద్రంలో దేవరకొండ కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఆదివారం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని అన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పాలకుల నిర్లక్ష్యం వల్లే వెనకబాటు



వార్డులో పర్యటిస్తున్న చింతలపల్లి జగదీశ్వర్‌రావు

**కొల్లాపూర్:** పాలకుల నిర్లక్ష్యం వల్లే నియోజకవర్గ అభివృద్ధి చెందడం లేదని కాంగ్రెస్ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్‌సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రంగినేని జగదీశ్వరుడు, రాము యాదవ్, పరశురాంనాయుడు, ఖాదర్‌పాషా, జహంగీర్, నాగన్న, కాంతారావు తదితరులున్నారు.

# కార్మికుల వినూత్న నిరసన



నాగర్‌కర్నూల్‌లో ఆకులు తిని నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



వెల్దండలో పచ్చిగడ్డి తింటూ..

**సాక్షి, నెట్‌వర్క్:** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజు ఆదివారం కొనసాగింది. జిల్లా కేంద్రంలో కార్మికులు ఆకులు తింటూ వినూత్న నిరసన చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మద్దతు తెలిపారు. వెల్దండలో పచ్చిగడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. తెలకపల్లిలో నెహ్రూ విగ్రహానికి కార్మికుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, రంగినేని జగదీశ్వరుడు, రాముయాదవ్‌లు మద్దతు ప్రకటించారు. పెద్ద కొత్తపల్లి, బిజినేపల్లిలో సమ్మె కొనసాగింది. కల్వకుర్తిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మద్దతు తెలిపారు.



కల్వకుర్తిలో ..



బిజినేపల్లిలో..

## నూతన కమిటీ సభ్యులకు సన్మానం

**కల్వకుర్తిరూరల్:** గౌడ సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు రుక్కుల్ గౌడ్, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆనంద్‌గౌడ్, కోశాధికారిగా రవిగౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రఘుగౌడ్, కార్యదర్శిగా నాగేశ్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. దీంతో ఆదివారం పట్టణంలో నూతన కమిటీలో స్థానం పొందిన నాయకులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, మాజీ చైర్మన్ శ్రీశైలం, కౌన్సిలర్ సైదులు, శ్రీనివాసుగౌడ్, రాజుగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

## వర్గీకరణ సాధించే వరకు పోరాడుతాం

**కొల్లాపూర్:** వర్గీకరణ సాధించే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాదిగ మాట్లాడారు. ఆగస్టు రెండోవారంలో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అగ్రస్వామి, కొండూరు రాములు, వడ్డెమాన్ రాములు, సులిగిరి శ్రీనివాసులు, బచ్చలకూర లక్ష్మణ్, పరమేష్, చక్రవర్తి,రాజు తదితరులున్నారు. బల్మూర్

**కొల్లాపూర్ రూరల్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించే విశ్వరూప సభ సన్నాహక సమావేశానికి మండలంలోని పలు గ్రామాల నుంచి దండోరా నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొల్లాపూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించి మహనీయులకు నివాళులర్పించారు.



కొల్లాపూర్‌లో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ఊర్కొండ:** ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ధార రాధాకృష్ణ అన్నారు. ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి నాయకులతో కలిసి ఆయన తరలివెళ్లారు. దార బంగారయ్య, పరశురాములు, బంగారు శ్రీనివాసులు, రమేష్, నాగరాజు, మధు, శివ, శ్రీకాంత్ నాయకులు ఉన్నారు.

## కుక్కల బెడద

**బల్మూర్:** మండల కేంద్రంలో రోజురోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. ప్రధాన రహదారులపై తిరుగుతూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నాయి. స్థానిక బస్టాండ్, నమాజ్‌గడ్డ ,గ్రామ పంచాయతీ ప్రాంతాల్లోని రోడ్డుపై కుక్కలు నిత్యం గుంపులుగా సంచరిస్తూ వాహనాల వెంట పడుతుండటంతో వాహనదారులు భయాందోళనక గురవుతున్నారు. ఇటీవల లింగాల వైపు వెళ్తున్న ఓ వాహనదారుడిని కుక్కలు వెంటపడటంతో వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. చిన్నారులు, విద్యార్థులు ఇంటినుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ వారు స్పందించి గ్రామంలో ఉన్న కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బల్మూర్‌లోని బస్టాండ్ వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

## బాధిత కుటుంబానికి పరామర్శ

**వంగూరు:** మండలం జాజాల గ్రామానికి చెందిన వెంకటయ్య(70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు పోతుగంటి రాములు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట గ్రామస్తులు కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, అంజనేయులు, జాన్‌పాషా, అశోక్ రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**చారకొండ:** మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన గంగల శ్రీను శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీను మరణం కలిచివేసిందని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు వెంకటయ్య యాదవ్, రామచంద్రి, మబ్బుల్, తదితరులు ఉన్నారు.

## నేడు ముఖ్య నాయకుల సమావేశం

**చారకొండ:** బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని సోమవారం మండల కేంద్రంలోని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు ఏదిరే రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అచ్చంపేట్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరవుతారని పేర్కొన్నారు.